


# పండుగ బహుమతి

జి.వి. సాయికుమారి

కాలేజినుండి ఇంటికి రాగానే కాఫీ కప్పుతో పాటు ఒక ఉత్తరం కూడ భర్తకి అందించింది సరోజ.

"ఎవరు రాసేరు ?" అన్నాడు ప్రభాకర్ కాఫీ కప్పు, ఉత్తరం అందుకుంటు.

"నాన్న రాసేరు...దసరాకిమనిద్దరిని రమ్మని."

కాఫీ త్రాగుతూ ఉత్తరం చదివేడు ప్రభాకర్.

"...పండక్కి పదిరోజుల ముందే రాస్తున్నాను మీకు. అమ్మాయి నాలుగు రోజులు ముందే వచ్చేయండి..." అంటు జగన్నాధరావుగారు రాసేరు.

"యూనివర్శిటీ పేపర్లు దిద్దాలి సరూ, బహుశ నాకు ఖాళీ వుండదేమో. వీలుంటే దీపావళికి వెళదాం ... దేవిగారికి ఆగ్రహం రాలేదు కదా ఈ దీనుడిమీద..." నవ్వుతూ అన్నాడు ప్రభాకర్.

సరోజ కూడ అందంగా నవ్వి, "వస్తే ఏం చేస్తారట..." అన్నది బుంగమూతి పెట్టి.

"ఏంచేస్తాను...క్షమించమని వేడుకుంటాను. బ్రతిమలాడుకుంటాను. కావాలంటే నాలుగు దెబ్బలు తింటాను. భార్యచేత కాలితో తన్నించుకోవటం ఆ కృష్ణ పరమాత్ముడికే తప్పలేదట ..."

"ఇంక ఆపండి బాబు ... ఎవరైనా వింటే పాపం మీరు మరీ అంత భార్యావిధేయులనేసుకుంటారు....మొగుణ్ణి కొంగుకు కట్టుకు తిరుగుతుందని నన్ను ఆడిపోసుకుంటారు."

"కాదంటావా మరి ..." కొంటెగా ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగేడు ప్రభాకర్.

"సంతోషించేం గాని స్వామీ, ముందు ప్రయాణం సంగతి శెలవ యివ్వండి ...."

"తమరు కాదుకూడదంటే ఎట్లాగు తప్పదు మరి ... కాని కష్టం సరూ !"

"మీకంత వీలు లేకపోతే, వీలు కాలేదని నాన్నగారికి రాసేద్దాం ... ఇందులో బలవంతం ఏమున్నది ..."

"చాలా థ్యాంక్స్ శ్రీమతి ... నీలాటి భార్య దొరకటం నా అదృష్టం.

"చాలు చాలు చాలు, మీ పొగడ్తలు భరించలేక వున్నాను. తమరిలాటివారిని చూస్తే సామెతలు పుట్టుకొస్తున్నాయి."

ఏమి సామెతా? ఏమా కథా?

"పెళ్ళయిన ఆరునెలలు భర్త భార్య మాట వింటాడట. తరువాత ఆరునెలలు భర్త మాట భార్య వింటుందట...ఆ తరువాత వాళ్ళిద్దరిమాటలు బయటివాళ్ళు వింటారట..."

పకపక నవ్వేశాడు ప్రభాకర్.

"బావుంది....చాల బావుంది...మన పెళ్ళయి ఇంకా సంవత్సరం కాలేదుగా...ప్రస్తుతం ఇద్దరం ఒకరిమాట ఒకరు వినేస్థితిలో వున్నామన్నమాట.."

"చాప్ వూరుకోండి...ఎంత సిగ్గులేనివారుబాబు మీరు..." అన్నది సరోజకూడ నవ్వేస్తూ.

"నాకు వీలుకాలేదని రేపు మీ నాన్నగారికి ఉత్తరం రాస్తాను. నువ్వుకూడ రాసేయి..." అన్నాడు ప్రభాకర్ స్నానానికి భుజాన టవల్ వేసుకుని లేస్తూ.

సరోజ వంటగదిలోకి దారి తీసింది భర్త మాటలు తలుచుకుని నవ్వుకుంటూ.

మరో వారం రోజుల తర్వాత జగన్నాధరావుగారి దగ్గరనుండి ఉత్తరం దాంతోపాటు పాతిక రూపాయల మనియార్డరు వచ్చింది.

చిరంజీవి సౌభాగ్యవతి సరోజని

దీవించి వ్రాయునది. మేమంతా క్షేమము. మీ క్షేమములు తెలిసినందుకు సంతోషం. నీ దగ్గర నుండి, పద్మ దగ్గరనుండి ఒక్కసారే ఉత్తరాలు వచ్చినయి, పండక్కి రాలేమని.

"ప్రయాణం ఖర్చులు చాలా అవుతాయి. ఇప్పుడెందుకులే, మరోసారి వెళ్ళదాం" అని సుధాకర్ అన్నట్లు పద్మరాసింది.

మీ ఉత్తరం ద్వారా అల్లుళ్ళ వుద్దేశ్యాలు తెలిసినయి. ఎంతయినా క్రొత్త అల్లుళ్ళుకదా, మొదటి పండక్కి వూరికే రమ్మనటం కూడ బావుండదు. అందుచేత డబ్బుపంపుతున్నాను. అల్లుడుగారు, మీరు తప్పక పండక్కి వచ్చేయండి.

ఆశీస్సులతో,

జగన్నాధరావు.

సరోజ ఉత్తరం చేత్తోపట్టుకుని బాధగా కుర్చీలో కూర్చుండిపోయింది.

"ఈ ఉత్తరం చూస్తే ఆయనేం అనుకుంటారో? తీరికలేక రానన్నారుగాని, డబ్బు ఖర్చు అవుతుందనా? అయినా నాన్న మనుష్యులను సరిగ్గా అర్థం చేసుకోరు.

"ఈ విషయం తెలిస్తే ఆయనెంత బాధపడతారో..." అని నిట్టూర్చిందామె.

సాయంత్రం భర్తరాగానే తండ్రి పంపిన డబ్బు, ఉత్తరం అతని చేతికిచ్చింది సరోజ.

ఉత్తరం చదువుతుంటే ప్రభాకర్ కనుబొమ్మలు ముడివడ్డాయి.

"నువ్వుగాని రాసేవా, సరూ, మన ప్రయాణానికి ఖర్చులవుతాయని?

"లేదండీ, మీకు వీలుకాదని రాసేను. వీలుంటే దీపావళికి వస్తామని రాసేను. నాన్నే తొందర..."

ఆమె ఇంకా ఆ మాట పూర్తిచేయక ముందే ప్రభాకర్ ఉత్సాహంగా ఈలవేసి.

"అయితే తప్పేమన్న మాట. మరి ప్రయాణానికి సిద్ధంకా. పాపం మావగారు డబ్బు పంపేరుకూడ. వెళ్ళకపోతే బావుండదు మరి." నవ్వేడతను.

భర్తమాటలకి తెల్లబోయింది సరోజ.

ఉత్తరం చూడగానే "ఇదేమిటి సరూ, మావగారు డబ్బు పంపేరు. మనమేం డబ్బు పంపలేదని పండక్కి రానన్నామా? ఈ రోజే ఆయనకి డబ్బు పంపేస్తాను. లేకపోతే మనం వెళ్ళినప్పుడయినా ఇచ్చేద్దాం" అంటాడేమోనని ఆశించింది. కాని తన భర్తకూడా ఇంతేనన్నమాట...అసలే అల్లుళ్ళజాతే ఇంతేనేమో...వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకుని లోపలికి వెళ్ళిపోయింది సరోజ.

* * *

అట్లా వున్నావేం సరూ? వంట్లో బాగాలేదా? అని అడిగాడు ప్రభాకర్ ఆరోజు రాత్రి భోజనాల దగ్గర.

ఎప్పుడు గల గల మాట్లాడే సరోజ ముభావంగా వుండటం వింతనిపించిందతనికి.

విని విననట్లు సమాధానం చెప్పకుండా కూరప్లేటు అతనిముందు వుంచింది.

"నా ప్రశ్నకి సమాధానం చెప్పనేలేదు ..."

> మానవులందరకూ సమాన అవకాశాలు ఉండాలన్న ఆదర్శంవల్ల ప్రజాస్వామ్యం అభిలషణీయం. ఆ ఆదర్శాన్ని అంతర్యంలో అనేకులు ప్రతిఘటిస్తారు. కనక ప్రజాస్వామ్యం అత్యవసరం.
>
> — డాక్టర్ నీబుర్.

అన్నాడతను అన్నం కలుపుకుంటు.

ఏమిటన్నట్లు భర్తవంక చూసింది సరోజ.

"అట్లావున్నావేం"

వంట్లో బాగాలేదు ..."

"ఎందుచేత?..."

"బాగానే వున్నది, రోగాలు ఫలానా అందుకు వస్తున్నామని చెప్పి వస్తాయా ఏమిటి..." విసుక్కున్నది సరోజ.

తెల్లబోయి చూశాడు ప్రభాకర్ భార్యవంక.

"లేదు సరూ, నువ్వీరోజు చాల గమ్మత్తుగా మాట్లాడుతున్నావు ... ఏదో కారణం వుంది..."

"కారణం ఏదో వుంటేగాని నాకు రోగం రాకూడదా? ఎంత మీ భార్యనైనా, నేను ఒకమనిషినే. నాకు మనస్సువున్నది. నా మనస్సుకి శరీరానికి కూడ మీ ఆజ్ఞ లేకుండ రోగాలు, రొష్టులు రాకూడదని రూలెక్కడ లేదు ..."

సరోజ ముక్కు చివరలు ఎర్రగా అయినాయి. బలవంతంగా కన్నీరు ఆపుకున్నది.

భార్యవంక ఒక్క క్షణం విశ్చలంగా చూసి మరేం మాట్లాడకుండ తల వంచుకుని భోంచేసేడు ప్రభాకర్. సరోజ అన్నం అటు, ఇటు కెలికి చెయ్యి కడిగేసుకున్నది.

* * *

"అయ్యా, పండగ మామూలు ఇప్పించండయ్యా..." వీధిలో నుండి నౌకరు మాటలు వినిపిస్తున్నాయి సరోజ గదిలోకి.

"పండగ ఇంకా నాలుగురోజు లున్నదికదోయ్. ఇస్తానులే..." అన్నాడు ప్రభాకర్.

"తమరు వూళ్ళో వుండరేమో కదయ్యా... బీదోళ్ళం. నాలుగు రోజుల ముందే డబ్బు వసూలు చేసుకుంటే పండక్కి రెండు గుడ్డముక్కలు కొనుక్కోవచ్చు..."

ఆ మాటలు వింటున్న సరోజకి తన భర్తకి పండుగ మామూలు అడుగుతున్న నౌకరికి తేడా ఏమిటో బోధపడలేదు. సంవత్సరమంతా కష్టపడే పనివాళ్ళు, సేవలు చేసేవాళ్ళు దీనంగా అడిగి పండుగ మామూళ్ళు వసూలు చేసుకుంటుంటే, ఈ అల్లుళ్ళు అత్తమామల దగ్గర నుండి పండుగ మామూళ్లు దర్జాగా వసూలు చేసుకుంటారు. ఛీ...ఛీ ఏం మగవాళ్ళు...స్వశక్తితో సంపాదించుకుంటు, నలుగురికి పెట్టగల శక్తి వుండికూడ మావగారిని పీడించుకు తింటారెందుకో ఈ అల్లుళ్ళ జాతి ... ఈనాటి యువతరం కూడ ఎందుకింత హీన స్థితికి దిగజారిపోతున్నారో..." అనుకున్నది సరోజ.

భర్తతో పూర్వంలా మాట్లాడలేకపోతున్నదామె. నిశబ్దంగా కళ్ళుమూసుకు పడుకున్నది.

పెళ్ళి కాకపూర్వం తనకి కాబోయే భర్త ఆదర్శ యువకుడిగా, మిగిలిన వారందరిలో ఎన్నుకోతగ్గవాడిలా వూహించుకోవటం కన్నెమనస్సుల అలవాటు. సరోజ కూడ ఆ వూహల్లోనే అపూర్వ సౌధాలు నిర్మించుకున్నది.

పెళ్ళయిన తరువాత ప్రభాకర్ గుణగణాలను చూసి మురిసిపోయింది సరోజ. తన వూహలకు, తన ఆదర్శాలకు సరయినవాడని ఆనందించింది... కాని ఇప్పటివరకు అతను మేక తోలు కప్పుకున్న పులి అని తెలీదు. సున్నితమైన సరోజ హృదయం గాయమై బాధ పెట్టసాగింది.

* * *

పండుగ రేపనగా బండిదిగిన కూతురు, అల్లుడిని చూచి మురిసిపోయారు జగన్నాధరావుగారు, అన్నపూర్ణమ్మగారును. సరోజ చిన్న చెల్లెళ్ళు, తమ్ముళ్ళ హడావిడి అయితే చెప్పే అక్కరలేదు. సరోజా వాళ్ళు వచ్చేసరికే, పద్మా, సుధాకర్ వచ్చేసివున్నారు.

ఇంత సందడిలో ఎంత సరదాగా తిరుగుతున్నా మనస్ఫూర్తిగా నవ్వలేక పోతున్నదామె.

తను, తన భర్తా వచ్చినందుకు అమ్మా, నాన ఇప్పుడు మురిసిపోతున్నారు, కాని, ఈ సందడి తగ్గిన తర్వాత వాళ్లు డబ్బుగురించి ఎంత ఇబ్బంది పడేది తలుచుకుంటే ఆమె మనస్సు తల్లడిల్లిపోతున్నది.

తెచ్చుకున్న జీతంరాళ్ళతో ఒక ప్రక్క కుటుంబాన్ని పోషిస్తూనే, ప్రయివేట్లు చెప్పి వెనకేసినడబ్బుగాక కొంత అప్పుచేసి సరోజకి, పద్మకి పెళ్ళి

చేశారు జగన్నాధరావుగారు.

పెళ్ళిళ్ళకి చేసిన అప్పుల బాకీలనుండి ఇంకా ఆయన పూర్తిగా తేరుకోనేలేదు. ఇంతలో పండుగలు వెంటపడ్డాయి అల్లుళ్ళకు రానుపోను ప్రయాణం ఖర్చులు, పండగ కానుకలు, క్రొత్తబట్టలు అవీ. ఇవి చూడలేక తల తిరిగిపోతుం దాయనికి. లోలోపల ఎంత బాధపడుతున్నా పండక్కి వచ్చిన అల్లుళ్ళ ముందు, కూతుళ్ళముందు తెచ్చిపెట్టుకున్న సంతోషంతో తిరుగుతున్నారు జగన్నాధరావు, అన్నపూర్ణమ్మగారును.

పండుగరోజు తెల్లవారుతూనే తలంటుస్నానాలతో పిండివంటలు చేయటంతో హడావుడిగా వున్నారు అన్నపూర్ణమ్మగారు. జగన్నాధరావుగారు పూజ గదిలో అమ్మవారిని అలంకరించి, పూజ చేస్తున్నారు. సరోజ, తండ్రి పూజకోసం పూలు కోసుకు రావడానికి వీధివైపు గది ప్రక్కనున్న మందార చెట్టుదగ్గరకి వెళ్ళింది.

"అదిసరే పద్మా, మరి పండక్కి మీ నాన్నగారు మాకిచ్చే కానుకలేమిటి? రేడియోలా? స్కూటర్లా? ఇంతవరకు మాకు చూపించనేలేదు. ఆ ఖణాన్ని బయటకితీసి మమ్మల్ని ఆశ్చర్యపరుస్తారేమిటి మీ వాళ్ళు..." అంటున్నాడు సుధాకర్.

సరోజ వినకూడదంటూనే ఆ మాటలు విని గబుక్కున ఆగిపోయింది.

"ఏం పద్మా. మాట్లాడవేం?..."

"భలేవారండీ మీరు... రేడియోలు లేవు... స్కూటర్లులేవు... నాన్న ఇద్దరల్లుళ్ళకి క్రొత్త బట్టలతోబాటు చెరో వందరూపాయలు ఇస్తారట... అన్నది పద్మ.

ఏడ్చినట్లున్నది. ముష్టి వందరూపాయలకోసం. అంతదూరంనుండి రా, రమ్మని ఉత్తరాలమీద ఉత్తరాలు కురిపించటం ఎందుకో? ప్రయాణం ఖర్చులకంటు బోడిపాతికరూపాయలు పంపించేరు. కనీసం ఫస్టుక్లాసు చార్జీలయినా పంపాలన్న జ్ఞానం మీ వాళ్ళకి వుండద్దూ...ఇప్పుడు వందరూపాయలు ఇస్తారట... రేపొద్దున్న నా ఫ్రెండ్సంతా, పండక్కి మీ మావగారేమిచ్చేరు అని అడిగితే నేనేంచెప్పను? ఇంతటి మహా మేరుపర్వతం ఇచ్చేరని చెప్పి వాళ్ళముందు తలెత్తుకోగలనా?" అంటూ ఖస్సున లేచేడు సుధాకర్.

"కొంచెం నెమ్మదిగా మాట్లాడండి. మీకు పుణ్యం వుంటుంది. మీ ధోరణి మీదేగాని, మా నాన్న పరిస్థితి కొంచెంకూడా అర్థంచేసుకోరేం?.." అంటు పద్మ ఏదో సర్ది చెపుతున్నది.

సరోజ ఇంక అక్కడ నిలువలేక చక, చక ఇవతలకి వచ్చేసింది పూలు కోయకుండానే.

ఆమె ఆలోచనలు పరిపరివిధాలుగా పోతున్నాయి. "ఇంక తన భర్తతో తనెన్ని మాటలు పడాలో!" ఈ విషయం గురించి ప్రభాకర్ తొందరపడి ఏమయినా మాట్లాడితే పూరుకోదలుచుకోలేదు సరోజ.

* * *

"చిన్నల్లుడు, మరీ వందరూపాయలే ఇస్తున్నందుకు పద్మమీద విరుచుకుపడ్డాడట..." అన్నారు అన్నపూర్ణమ్మగారు.

"పెద్దల్లుడేమని కానిచ్చేరట?" కోపంతో


# వెలువడుతోంది!

1970 జనవరి 26 నుండి

# విశాలాంధ్ర

రాజకీయ వారపత్రిక

½ డెమ్మీ సైజు 12 పేజీలు

విడిప్రతి 25 పైసలు

సంవత్సర చందా రు. 12/-

అర్ధసంవత్సర చందా రు. 6/-

3 నెలల చందా రు. 3/-

★

వారం వారం........

అంతర్జాతీయ, జాతీయ సంఘటనలపై సమీక్ష, సిద్ధాంత, రాజకీయ సమస్యలపై వ్యాసాలు, ప్రజా ఉద్యమ అనుభవాలపై వ్యాసాలు, కథానికలు, సంక్షిప్త వార్తలు, వ్యాఖ్యలు, తదితర శీర్షికలతో వెలువడుతుంది.

★

ఏజన్సీ కోరువారు జనవరి 20 లోగా ఒక్కొక్క ప్రతికి రు. 2 లు చొప్పున డిపాజిట్ కట్టవలయును.

ఇతర వివరములకు
మేనేజరు

విశాలాంధ్ర
రాజకీయ వారపత్రిక
మాచవరం పోస్టు, విజయవాడ-4

వ్యంగ్యంగా అని అడిగేరు జగన్నాధరావుగారు.

"ఏమో మరి, అతనేం అన్నట్లు సరోజ నాతో చెప్ప లేదు."

"అతను మాత్రం తక్కువేం తిన్నాడు ... ఇంకో గంటాగితే అతని అజ్ఞలు కూడ మనం వినవల్సివస్తుంది ... నన్ను మాత్రం ఏం చెయ్య మంటావు...? మొన్న పెళ్ళిళ్ళకు చేసిన అప్పులే ఇంకా తీరలేదు. ప్రాణానికి సుఖం లేకుండా ఈ పండగలొకటి వెంటపడ్డాయి..." అంటూ విసుగ్గా ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నారాయన.

"మరీ వంద రూపాయలయితే బావుండదేమో నండి. పాపం రేపు వాళ్ళ స్నేహితులు మావగా రేమిచ్చేరని అడిగినా చెప్పుకోవటానికి సిగ్గేయద టండీ? చేసే అప్పు చేస్తూనే వున్నాం కదా. ఇంకొంచెం డబ్బు తెచ్చి ఇద్దరికి చెరో రెండొంద లయినా చేతుల్లో పెట్టండి...మర్యాదగావుంటుంది" అన్నారు అన్నపూర్ణమ్మగారు.

"ఛాల్లే మహా సలహాలు చెప్పొచ్చావు. ఎక్కడి నుండి వస్తాయనుకున్నావు వందలు, వేలును ... మీ నాన్న నీకిచ్చిన ఆస్తిపాస్తులమీద వస్తున్నా యనుకున్నావా? ఈ సంసారం అంతా నా రెక్కల మీద ఈడ్చుకు రావల్సిందే గదా? అబ్బబ్బా ... కూతుళ్ళకి పెళ్ళిళ్ల అయి అల్లుళ్ల రావటం కాదు గాని, నా ప్రాణాలు పోయేట్లున్నాయి..." అంటూ విసురుగా కుర్చీలోనుండి లేచేరాయన.

"తనదాక వస్తేగాని తెలీదట ... మీరు ఆ రోజుల్లో, ఈ పండుగల కానుకల కోసం చేసిన హంగామా అప్పుడే మర్చిపోయినట్టున్నారు. ఆ మాటకొస్తే మీకంటే మన అల్లుళ్ళే వెయ్యి రెట్లు నయం. ఏదైనా కావాలంటే అమ్మాయిల చేత కబురు పంపిస్తున్నారు. మీరు ఆయన దానికి, కానిదానికి మానాన్న మీద దండెత్తే వారు గుర్తుందా?" అంటూ ఎత్తి పొడిచేరు అన్న పూర్ణమ్మ భర్తని.

"సర్లేవోయ్, సంతోషించేం. మాటకి మాట అనటం బాగా నేర్చేవు. అమ్మాయిలకి, అల్లుళ్ళకి బట్టలు తెచ్చేను. నచ్చినవో లేదో చూడమను... అవికూడ నచ్చకపోతే తీసుకువచ్చి నా నెత్తిన కప్పండి..." అంటూ వరండా వీధిలోకివచ్చిఅరుగు మీద వున్న పడక కుర్చీలో కూర్చున్నారాయన.

తన సంసారం గురించి ఆలోచిస్తుంటే, ఒక హద్దున్నట్లు కన్పించలేదు జగన్నాథరావుగారికి తన పెళ్ళయిన క్రొత్తలో సంగతులన్నీ ఒకసారి కళ్ళముందు కదలిపోయినయి.

"అన్నపూర్ణమ్మమీద ఎగిరి నోరుమూయించినా, ఆనాడుజరిగిందిమాత్రంనిజం. తనకీరోజు అనుభవం మీదగాని అసలుసంగతి తెలియటంలేదు. తన తల్లి దండ్రులుఅత్తగారింటికి వెళ్ళేముందుచేసిన దుర్బో ధనలవలన, స్నేహితులచెప్పుడు మాటలవలన, తన మావగారు ఎంత ఇచ్చినా, ఎంతప్రేమగా చూసినా, ఆయనేదో మనస్సులో పెట్టుకుని. తన కివ్వవల సింది ఇవ్వక నలుగురిలో అవమానం చేస్తున్నట్లు బాధపడి,నానా రగడా చేసేవాడు.

కాలంతోబాటు మనుష్యులు, అలవాట్లు మారక పోయినా, కొంచెం సంస్కారం పెరిగినట్లున్నది, తన అల్లుళ్ళు వాళ్ళకి కావలసినవాటి కోసం ఎదురు పడి తనతో దెబ్బలాడకుండ నిదానంగా అమ్మా యిలచేత కబురు పంపుతున్నారు..."

ఇట్లా ఆలోచిస్తువుంటే మనస్సంతా బాధతో నిండిపోయిందాయనకి. ఆ రోజుల్లో చేసిన తప్పుకి పశ్చాత్తాపంతో ఈ క్షణాన్న ఆయన మనస్సు దహించుకు పోతున్నది.

మధ్యాహ్నం భోజనాలు అయిన తరువాత అల్లుళ్ళనిద్దరిని పిలచి క్రొత్తబట్టలతోబాటు తాంబూ లంలో చెరో వంద రూపాయలు పెట్టి యిచ్చేరు జగన్నాధరావుగారు. అల్లుళ్ళిద్దరి ముఖాల్లో సంతోషం నామమాత్రంగానైనా కన్పించలే దాయనకి.

వాళ్ళిద్దరూ మారు మాట్లాడకుండ ఇచ్చింది పుచ్చుకుని ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళ వైఖరి గమనించి బాధగా నిట్టూర్చారు జగ న్నాధరావుగారు.

సాయంత్రం నాలుగయ్యేవరకు సరోజకి, పద్మకి వంటింటిలో తల్లికి సహాయం చేయటంతోనే సరి పోయింది. పనంతా అయిన తరువాత భర్తకి కాఫీ టిఫిన్ తెచ్చి టేబుల్‌మీద పెట్టింది సరోజ.

ప్రభాకర్ గదిలో కిటికీకి ఆనుకొని ఏదో చూస్తు నుంచున్నాడు.

టేబిల్‌మీద వందరూపాయలు గాలికి రెపరెప లాడుతున్నాయి.

"వందరూపాయలు చాల్లేదుకాబోలు యీాయన గారికి మూడ్సు మారిపోయినయి.." అనుకుని భర్త అల్పత్వానికి నిర్లక్ష్యంగా నవ్వుకున్నది సరోజ.

"కాఫీ తీసుకోండి" అన్నదామె మెల్లగా.

వెనక్కి తిరిగి ఆమెవంక చూసి, "ఈసంగతి నీకు తెలుసా?" అన్నాడు ప్రభాకర్.

ఏ సంగతి అన్నట్లు అతనివంక చూసింది.

"ఇదిగో మీనాన్నగారు చేసిన ఘనకార్యం... అల్లుడిని ఇట్లా అవమానిస్తాడనుకోలేదు, ముష్టి వాళ్ళకిచ్చినట్లు ఈ డబ్బు ఇవ్వటమెందుకు?" కొంచెం గట్టిగానే అన్నాడతను.

"ఏం, పాపం.. దసరా మామూలు వందరూపా యలు చాల్లేవా మీకు?" వెటకారంగా అడిగింది సరోజ. అప్పటివరకు బిగబట్టుకున్న కోపం ఇంక ఆగలేదామెకి.

ప్రభాకర్ ముఖం కోపంతో ఎర్రబడింది. పిడికిళ్లు గట్టిగా మూసుకుపోయినయి.

నువ్వేం మాట్లాడుతున్నావో సరిగ్గా ఆలోచించే మాట్లాడుతున్నావా సరూ? నాకీ డబ్బు చాలదు. ఇంకా కావాలి. నీ పుట్టింట్లోవున్న ధనరాసులన్నీ తెచ్చి నా నెత్తిన పొయ్యి అని నే నెప్పుడయినా నీకు చెప్పేనా?..."

"చెప్పినా, చెప్పకపోయినా మా నాన్న అంత కంటె ఒక పైసకూడ ఎక్కువ ఇవ్వలేరు. ప్రయాణం ఖర్చులతోసహా సంపేసు. ఇంకెక్కడి నుండి తెస్తారు? మా నాన్న మా పెళ్ళిళ్ళుచేసి అల్లుళ్లనికాదు తెచ్చుకున్నది... ఆయన పాలిటి.. ఆయన పాలిటి" కోపంతో సరోజకి మాటలు రావ టంలేదు.

"వూ...అను, పూర్తిగా అనేయ్... మేం ఆయన పాలిటి దశమగ్రహాలం... ఆయనపాలిటి పిశాచలం... అంతేకదూ..."

అల్లుడి కేకలు విని తన అసమర్థతకి నిస్సా హాయంగా చింతిస్తూ వుండిపోయారు జగన్నాధ రావుగారు.

"పండుగపూట సంతోషంగా గడపక ఈ రాద్ధాంతమంతా ఎందుకు? ఏమి గొడవ జరగ నున్నదో, సరోజ అయినా మాట్లాడకుండ వూరు కుంటే బావుండును..." అనుకుంటు కళ్ళొత్తు కున్నారు అన్నపూర్ణమ్మగారు.


"ఆ కేకలు ఎవరివి? మీ బావేనా అరిచేది?" అన్నాడు సుధాకర్ పద్మతో.

"వూ..."

"ఎందుకుట? ?"

"ఎందుకేమున్నది? మీరు మెల్లగా సాధిస్తున్నది, ఆయన అక్కతో గట్టిగా అంటున్నారు. ఇంక

(మిగతా 48 వ పేజీలో)



## రచయిత శ్రీశ్రీ

(23 వ పేజీ తరువాయి)

సంగీతం విప్లవించి శపిస్తూ విజృంభించింది.

ఎంత ధ్వని సమన్వితమో యింకా ఎందుకు వివరణ?

### గుమాస్తా కల

ఇది గుమాస్తా జీవితం గురించి. గుమాస్తా పాపం కలలు కంటూనే జీవిస్తాడు. ఆ కలలు భగ్న మెలా అవుతాయో సున్నిత హాస్యంతో, మరోవైపు కన్పించని విషాదంగా చిత్రణ సాగుతుంది.

గుమాస్తా కోనేటిరావు కలలో గొప్ప ఇంజనీరయి పోయాడు. అమెరికా ఆయనకు స్వాగతం చెప్పింది. తన సన్మానానికి సమాధానం చెబుతూండగా ఆయన చంటిపిల్ల ఏడ్చింది! అప్పుడే ఏడ్వాలా పాడుపిల్ల! పాపం కల చెదరిపోయింది.

మళ్ళా యింకో కల.

ఈసారి ఆయన జర్మన్ సబ్‌మెరైన్ కమాండర్ జుటావర్ కోనేట్. కలవరిస్తూండగా ఈసారి పాడు పిల్లి పాలగిన్నెను పడదోస్తుంది...కల చెదరిపోయింది.

ఇంకో కల.

సినిమాలో హీరో హీరోయిన్ రాజకుమారితో ఆయన ప్రణయం - విడుతునా ప్రాణాలైనా! విడుతునా నిన్నెన్నడైనా అంటున్నాడు. తెల్లవారింది. అబ్బాయి లేపేశాడు. కొడుకు - 'తెల్లారిపోయింది నాన్నా' అన్నాడు.

భయం: కొండెక్కిపోయింది కోనేటినిద్ర.

ఆశ: కోనేటి నిద్రలో కోడికూసింది.

ఎంత చక్కటి భావుకత!

ఈ నాటికలో ఈ కలల మధ్య ఆశకూ, భయానికీ సంవాదం జరుగుతుంది. ఆ సంవాదంలో, "... అతని నిజమైన జీవితం ఒక స్వప్నం ... అతని స్వప్నం యెన్నడూ సాధ్యంకాని అబద్ధం" అంటుంది ఆశ. 'ఈ దుస్థితికి కారణం నువ్వే' నంటూ ఆశ భయాన్ని నిందిస్తుంది.

ఇదే విధంగా బల్లి, మరో ప్రపంచం మొదలగు నాటికలు ఆయన విప్లవభావాలకు ప్రతిబింబాలు.

శ్రీశ్రీ విశ్వ విప్లవ కవి. ఆయన కసీసం మూరేళ్ళు మన సాహితీ క్షేత్రాన్ని దున్నుతో ఈ మూలుగుతున్న విశ్వానికి చక్కని పంట అందించాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు శుభాకాంక్షలు.

వ్యాసం ముగించేముందు శ్రీశ్రీ కి ఒక విషయం జ్ఞాపకం చేయదలిచాను. ప్రదర్శన కనుకూలమైన ఒక నాటకాన్ని రచిస్తానని దాదాపు మూడుసంవత్సరాల క్రితం వాగ్దానం చేసినమాట.

వాగ్దానం వాగ్దానంగా ఉండదనీ కార్యరూపం ధరించ వచ్చునని అనించడం అడియాస కాదనుకుంటాను.

## పండుగ బహుమతి

(44 వ పేజీ తరువాయి)

అందులో చెప్పుకోతగ్గ విశేషం ఏమున్నది?"

"నేనేం చేసినా నీ కంట్లో దూనదుగాని పద్మా మీ బావకంటే నేనే నయం. ఇచ్చిన దానితో తృప్తిపడటానికి ప్రయత్నిస్తున్నాను గాని అతనిలా నలుగురికి తెలిసేలా అరుస్తున్నానా?

అయినా అల్లుళ్ళని ఇట్లా అవమానించటం మీ నాన్నకే సరిపోయింది. అంతా నాలాటివాళ్ళే వుంటారా? అందరి కష్టసుఖాలు ఆలోచించటానికి" అంటూ తన మంచితనానికి తానే మురిసిపోతూ, భార్యని దెప్పేడు సుధాకర్.

రెండు మూడు నిముషాలు మౌనంగా గడచిపోయినది.

"సరోజా...నువ్వుచాలాతొందరపడ్డావు సరోజా! ఇదిగో మన ప్రయాణం ఖర్చులకి పంపిన డబ్బు. ఇందాక ఇచ్చిన ఈ వందరూపాయలు ముందు తీసుకువెళ్ళి మీ నాన్నగారికి ఇచ్చేయి...

మీరు ప్రయాణం ఖర్చులు పంపలేను...అందుచేత, మేం పండక్కి రావటంలేదని నువ్వుగాని నేను గాని మీ నాన్నగారికి రాసేమా?

పండుగ రెండురోజులు సరదాగా నలుగురితో గడుపుదామని వచ్చేంగాని, బట్టలు పెడితేనేగాని వీల్లేదు, కానుకలు ఇవ్వకపోతే అసలే వూరుకోనని నేనెప్పుడయినా అన్నానా?

నాకు అంతపనివున్నాకూడ అసలు నేను ఇప్పుడు ఎందుకు వచ్చానో తెలుసా సరోజా నీకు? మనం రాలేమనటానికి కారణం డబ్బేనని మీ నాన్నగారికి ఎవరు చెప్పారో కనుక్కుందామని...

...మీరు మనుష్యులని చాల బాగా అర్థం చేసుకోగలరండి!...అని చెపుదామని వచ్చేను.

నువ్వుకూడా నీ భర్త పరమ కర్కోటకుడు... వాళ్ళముందు డబ్బు పెడితేనేగాని అడుగు ముందుకు వేయడు అని అనుకున్నావుకదూ..చాల సంతోషం సరూ...నువ్వుకూడా మనుష్యులని చాల బాగా అర్థం చేసుకోగలవు!..."

సరోజ భర్తమాటలు వింటూ స్థాణువులా నిలబడిపోయింది.

"ఈ డబ్బు తీసుకువెళ్ళి వెంటనే మీ నాన్నగారికిచ్చేయ్ సరూ..."

అని ప్రభాకర్ విసురుగా తలుపులు తెరచుకుని వరండాలో నిలబడ్డాడు.

అల్లుడి మాటలు విని తెల్లబోయి ఒకరిముఖాలొకరు చూసుకున్నారు అన్నపూర్ణమ్మగారు, జగన్నాథరావుగారూను. అతని సహృదయత, మంచితనం తెలిసేసరికి తమంత అదృష్టవంతులు ఈ సృష్టిమీద లేరని ఆనందంతో తబ్బిబ్బులాడిపోయా రాదంపతులు.

అప్పటివరకు భార్యని దెప్పుతున్న సుధాకర్ చివరకి ప్రభాకర్ ఉద్దేశ్యం గ్రహించి ఏమి మాట్లాడాలో తోచలేదతనికి.

"పాపం, మీరు అన్యాయంగా మా బావగారిని అపార్థం చేసుకున్నారు....మీ సహృదయత కూడ కొంచెం చాటుకొండి స్వామి. లేకపోతే అక్కముందు నా పరువు నిలబడదు......" అంటూ భర్తని వెక్కిరించింది పద్మ.

భర్త సంస్కారానికి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సరోజ బల్లమీద రెపరెప లాడుతున్న డబ్బు వంక చూస్తు నిలుచుండి పోయింది.

అంకితం:

సహృదయులైన క్రొత్త అల్లుళ్ళకి.

★

## స్వీకారం

### యుగ సంకేతం

(కవిత)

రచన: మాదిరాజు రంగారావు

ప్రచురణ: సాహితీ బంధు బృందం

హనుమకొండ - వరంగల్లు I.

వెల: రు. 3/-

* * *

### తిరగబడు

(స్వచ్ఛంద కవితా సంచలనం)

ప్రచురణ: స్వేచ్ఛాసాహితి

6/551/3 - బ్రాహ్మణవీధి

హనుమకొండ, వరంగల్ I.

### మన శీనయ్య

రచన: నండూరి సుబ్బారావు

వెల: రు. 3

* * *

### రామశాస్త్రి

అనువాదం - యస్. ఆర్.

వెల: రు. 1-25

* * *

### రోమన్ హాలిడే

(కథలు)

రచన: గొల్లపూడి మారుతీరావు

వెల: రు. 3-50

ఈ పుస్తకముల ప్రచురణకర్తలు:

సర్వోదయ పబ్లిషర్సు,

విజయవాడ - 2.

Edited, Printed and Published by Maddukuri Chandrasekhara Rao, at Swatantra Art Printers, Vijayawada-